- అధికారం చేపట్టాక పథకంపై స్పందించని సర్కారు
- అదే బాటలో కేసీఆర్ కిట్ స్కీం..
- 2,507 మంది యాదవులకు డీడీ డబ్బులు వాపస్
- రైతుల వినతి మేరకు కలెక్టర్ నిర్ణయం

## సందిగ్ధంలో సంక్షేమ పథకాలు..

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ సందిగ్ధంలో పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడిచినా పథకాల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేసి గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు చెక్ పెడుతున్నది. గొర్రెల పథకంతోపాటు కేసీఆర్ కిట్ కూడా పెండింగ్‌లోనే ఉన్నది. ఇతర పథకాలను కూడా పెంచి అమలు చేస్తామన్న ఒక్క హామీ కూడా అమలు కాలేదు. పింఛన్లు, రుణమాఫీ, మహిళలకు రూ.2,500 వంటి హామీలు అమలుకు దూరంగా ఉండడంతో సంక్షేమ పథకాలన్నీ సందిగ్ధంలో పడినట్లయింది.

# గొర్రెల స్కీంకు మంగళం!

### సబ్సిడీ గొర్రెలకు ఫుల్‌స్టాప్ పెట్టిన కాంగ్రెస్

వనపర్తి, మే 19 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. 2018 నుంచి విడుతలుగా కొనసాగిన ఈ పథకం గొల్లకురుమల కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా ఈ పథకానికి వందలాది గొల్లకురుమలు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల హడావుడి వల్ల పెండింగ్‌లో పడిన ఈ పథకాన్ని అవినీతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పడేసింది. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పథకాలన్నింటినీ బంద్ చేయాలన్న ఆలోచనలో ఉన్న సీఎం నిర్ణయం మేరకు పేదలకు ఉపయోగపడుతున్న సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి.

వనపర్తి జిల్లాలో 2018లో గొర్రెల పథకం ప్రారంభమైంది. దీని ద్వారా వందలాది యాదవ కుటుంబాలు ఉపాధిని పొందాయి. మొదటి దఫాలో 13,890 యూనిట్ల ద్వారా 2,77,800 గొర్రెలు.. 13,890 పొట్టేళ్లను పంపిణీ చేశారు. రెండో విడుతలో 11,965 యూనిట్లను ఎంపిక చేయగా.. 621 యూనిట్ల ద్వారా 12,420 గొర్రెలు, 621 పొట్టేళ్లను పంపిణీ చేశారు. జిల్లాలోని గొర్రెలకాపరుల సహకార సంఘం ద్వారా దాదాపు 25,600మంది యాదవులు 201 గ్రామ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. గొర్రెల పథకంలో ఒక్కో యూనిట్ ద్వారా 20 గొర్రెలు, ఒక పొట్టేళును గత ప్రభుత్వం అందించింది. ఈ యూనిట్ ధర రూ.1.75 లక్షలు.. కాగా లబ్ధిదారుడు రైతు వాటా కింద రూ.43,750 చెల్లిస్తే మిగిలిన రూ.1,31,250ను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది.

### 2,507 మందికి డబ్బులు వాపస్..

రెండో విడుతలో గొర్రెల పథకం కోసం 2,580 మంది డీడీలు కట్టారు. 2023 జూలైలో వీరంతా రూ.43వేలను లబ్ధిదారుడి వాటా కింద డీడీలు తీసి పశుసంవర్ధక శాఖకు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. గొర్రెల పథకంపై స్పందించకపోవడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. పలు దఫాలు ప్రజావాణిలో దరఖాస్తులు అందజేయడం, కలెక్టర్ జిల్లా పర్యటనలో డీడీలు కట్టిన రైతులు మొరపెట్టుకోవడంతో సమస్య జటిలమైంది. డబ్బులు కట్టి నెలల తరబడి ఎదురుచూసినా గొర్రెల పంపిణీ చేయడం లేదని.. తమ డీడీలు వాపస్ ఇవ్వాలన్న వినతి మేరకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చొరవతో తిరిగి ఇచ్చేస్తున్నారు. రైతుల ద్వారా లిఖిత పూర్వక దరఖాస్తును తీసుకొని మళ్లీ వారి సొంత ఖాతాలోనే డబ్బులు జమ చేస్తున్నారు. ఇప్పటివరకు 2,507 మంది ఖాతాల్లో డీడీ డబ్బులు జమ చేశారు. డీడీలన్నీ మళ్లీ రైతుల ఖాతాల్లో జమ కావడంతో ఇక గొర్రెల పథకం గోవింద.. అని యాదవులు భావిస్తున్నారు.

### ప్రభుత్వానికి చేతగాక..



కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతగాకే గొర్రెల పంపిణీ పథకాన్ని ఆపేసింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పెండింగ్‌లో పెడుతున్నది. దీనివల్ల పేద కుటుంబాలు ఉపాధిని కోల్పోతున్నాయి. పథకాన్ని రద్దు చేసినట్లు ప్రకటించకుండా కేవలం అవినీతి ఆరోపణలతో సంక్షేమ పథకాలను ప్రభుత్వం సందిగ్ధంలో పడేసింది. ప్రజల్లో ఆదరణ ఉన్న పథకాలను తొలగించిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

*- పెండెం కురుమూర్తి యాదవ్, గొర్రెల కాపరుల సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు*

### 73మంది డీడీలు పెండింగ్..



రెండో విడుత గొర్రెల పంపిణీలో డీడీలు కట్టిన రైతులందరి ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు డీడీలను వారి ఖాతాల్లోనే వేశాం. ఇప్పటివరకు 2,507 మందికి చెల్లించాం.. ఇంకా 73 మందికి డబ్బులు ఇవ్వాలి. వారికి కూడా సమాచారం ఇచ్చాం. ఎప్పుడు వచ్చినా డీడీలు వారి ఖాతాలో వేసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతుల ఒత్తిడి మేరకు డీడీలు వాపస్ ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించుకున్నారు.

*- వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, వనపర్తి*





హత్యకు గురైన శ్రీకాంత్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# ధైర్యంగా ఉండండి..

- నిందితులకు తప్పకుండా శిక్ష పడేలా చూస్తాం
- శ్రీకాంత్ తల్లిదండ్రులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), మే 19 : మహబూబ్‌నగర్‌లోని బండమీదిపల్లి శివారులో ఉన్న శ్రీమల్లికార్జునవైన్స్ షాపు నిర్వాహకుల దాడిలో మృతి చెందిన శ్రీకాంత్ తల్లిదండ్రులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి గ్రామానికి ఆదివారం వెళ్లి శ్రీకాంత్ తల్లిదండ్రులు వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్‌ను పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. శ్రీకాంత్ మృతికి కారణమైన ప్రతి ఒక్కరికీ శిక్ష పడేవిధంగా న్యాయపరంగా తనవంతు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యవస్థ ఎటు పోతుందో అర్థం కావడం లేదన్నారు. తల్లిదండ్రుల ఒక్కగానొక్క కుమారుడిని కొట్టి చంపారని, ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పట్టించుకోకపోవడం ఏమిటని అసంతృప్తి వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంలో తమ కుమారుడిని కొట్టి చంపిన వారిని శిక్షించి న్యాయం చేయండి అంటూ పోలీసుల చుట్టూ రోజుల తరబడి తిరగడం ఎంత దౌర్భాగ్యమైన విషయం అన్నారు. ఇప్పటికైనా పోలీసులు బాధితులకు అండగా నిలిచి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, మండలాధ్యక్షుడు వేణు, సురేశ్, మహేశ్వర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

**చేవెళ్ల డీసీపీ కిషన్ పరామర్శ..**

చేవెళ్ల డీసీపీ కిషన్ శ్రీకాంత్ తల్లిదండ్రులను పరామర్శించారు. నిందితులకు తప్పకుండా శిక్షపడుతుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ భీంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 19 : ప్రతి కార్యకర్తకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాశీంనగర్‌లో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బీసం సతీశ్ కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య భానుప్రియకు నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా నిలుస్తుందని, పార్టీలోని కార్యకర్తలకు ఆపత్కాలంలో అండగా నిలిచేలా మొట్టమొదటిసారి బీమా పథకాన్ని బీఆర్‌ఎస్ పార్టీయే తీసుకొచ్చిందన్నారు. అలాగే నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కురుమూర్తియాదవ్, సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేశ్, నర్సింహ, గోపాల్‌నాయక్, జాత్రునాయక్, శంకర్‌నాయక్, సంపత్‌కుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మురళీసాగర్, కురుమూ ర్తి, రాము, మహేశ్, తిరుపతి, మోతీలాల్, గోవిం దు తదితరులు పాల్గొన్నారు.



పెద్దదగడ పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

- ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యనందించాలి
- సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతా : మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, మే 19 : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తామని, ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెద్దమారూర్, పెద్దదగడలోని ప్రభుత్వ పాఠశాలలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తన సొంత నిధులతో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తన స్వగ్రామమైన పెద్దదగడ, విద్యనందించిన పెద్దమారూర్ గ్రామాల పాఠశాలల నుంచే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. గ్రామాల్లో పేదలు, మధ్య తరగతి వారు స్థాయిని మించి పిల్లల విద్య కోసం కార్పొరేట్ పాఠశాలకు రూ.లక్షల్లో ఫీజులు కట్టి అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధలు తొలగించేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.

అందుకే ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దదగడ ఎంపీటీసీ పుష్పావతి, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కల్యాణ్‌కుమార్, చిదంబరెడ్డి, కృష్ణాప్రసాద్‌యాదవ్, బీచుపల్లి యాదవ్, మాజీ సర్పంచులు సురేంద్రసింగ్, రంజిత్‌కుమార్, ఈదన్న యాదవ్, నరేందర్‌గౌడ్, వడ్డెమాన్ బిచ్చన్న, బొల్లి కురుమయ్య, శ్రీను, కరాల వెంకటేశ్, శంకర్, మధుగౌడ్, మద్దిలేటి, యుగేందర్‌గౌడ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# చదివింది చారెడు.. చికిత్సలు బారెడు!



- పుట్టగొడుగుల్లా గ్రామీణ వైద్య కేంద్రాలు
- చెలరేగిపోతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు
- స్థాయికి మించి వైద్యసేవలు అందిస్తున్న వైనం
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు


గద్వాల అర్బన్, మే 19 : జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీ (గ్రామీణ వైద్యులు)లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. గతంలో గ్రామానికి ఒక్క ఆర్‌ఎంపీ వైద్యుడు ఉంటే గగనం.. అలాంటిది ప్రస్తుతం ప్రతి గ్రామానికి పదిమంది చొప్పున ఆర్‌ఎంపీలు ఉన్నారు. వీరు చదివింది చారెడు.. కానీ వీరు చేసే చికిత్సలు మాత్రం బారెడు.. అనేలా ఉంటున్నాయి. ఆర్‌ఎంపీలు చేసే చికిత్సలు పెద్దపెద్ద చదువులు చదివిన డాక్టర్లే కొన్ని సమయాల్లో చేయాలంటేనే జంకుతారు. కానీ వైద్య విద్యను కూడా చదవని ఆర్‌ఎంపీలు తమ స్థాయికి మించి రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీరు చేసే చికిత్సలు వికటించి రోగుల ప్రాణాల మీదకు వస్తున్నాయి. అయినా తమకు తోచిన చికిత్స చేసి రోగుల నుంచి అందినకాడికి దోచుకోవడం అలవాటుగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీల దందా జోరుగా సాగుతున్నది. వారు ఆయా దవాఖానల్లో కొన్ని రోజుల పాటు వైద్యం నేర్చుకొని (సహాయకులుగా పనిచేసి) అనంతరం ఏదో ఒకచోట క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. జిల్లాలో దాదాపు వేల మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఆయా గ్రామాల్లో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. వీరిలో చాలా మందికి వైద్యం మీద ఎలాంటి అవగాహన లేదనే ఆరోపణలు ఉన్నాయి. గట్టు మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ తన స్థాయికి మించి రోగులకు వైద్య చికిత్సలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రెండు, మూడు దఫాలుగా క్లినిక్ మీద దాడులు నిర్వహించారు. అయినా తనిఖీలు చేసిన కొన్ని రోజులు ఆగి మళ్లీ యథావిధిగా స్థాయికి మించి వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుసగుసలు వినబడుతున్నాయి. తనిఖీలకు వచ్చిన అధికారులకు ఆ ఆర్‌ఎంపీ మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. అదేవిధంగా అయిజ పట్టణంలోని కొట్టం కాలేజీ సమీపంలో ఓ ఆర్‌ఎంపీ కూడా తన స్థాయికి మించి వైద్య సేవలు అందిస్తున్నాడు. క్లినిక్‌తోపాటు ఏకంగా మెడికల్ షాపును ప్రారంభించి పెద్ద డాక్టర్‌లా రోగులకు చికిత్సలు అందిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలాగే రాజోళి మండలంలోని వెంకటాపురంలో కూడా ఓ ఆర్‌ఎంపీ తన క్లినిక్‌ను దవాఖాన తరహాలో నిర్వహిస్తూ గైనిక్‌కు సంబంధించిన చికిత్స అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక చికిత్స నిమిత్తం సూదులు, మందులు ఇంత నగదు అంటూ రోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. అలానే గర్భిణులకు స్కానింగ్ కూడా తీస్తున్నట్లు సమాచారం. కనీసం వైద్య చికిత్సకు సంబంధించి ఎలాంటి చదువు చదవకుండానే స్కానింగ్‌లు, చికిత్సలు నిర్వహించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీరి సగం సగం చికిత్సలతో ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థాయికి మించి వైద్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి, కానీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల్లో కొంత మంది మామూళ్లకు అలవాటు పడి వారిని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతుండగా గ్రామీణ వైద్యులు తమ దందాను మూడు.. పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. స్థాయికి మించి చికిత్సలు చేసే గ్రామీణ వైద్యులపై వైద్యాధికారులు అవగాహన కల్పించి నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉన్నది. కానీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారిపై దృష్టి సారించడంలో విఫలం అవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ప్రథమ చికిత్సలే చేయాలి..



గ్రామీణ వైద్యులు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలి తప్పా స్థాయికి మించి వైద్యచికిత్సలు చేయరాదు. రోగులకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ దవాఖానకు లేదా ఎంబీబీఎస్ డాక్టర్‌కు రెఫర్ చేయాలి తప్పా గ్రామీణ వైద్యులు చికిత్సలు చేయరాదు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా స్థాయికి మించి చేసే గ్రామీణ వైద్యుల క్లినిక్‌లను తనిఖీ చేసి వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

*- సిద్ధప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జోగుళాంబ గద్వాల*



జూరాలలో ప్రస్తుత నీటి నిల్వ

# జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ధరూరు, మే 19 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి ప్రాజెక్టుకు 2,596 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టులో 318.51 మీటర్లకు గానూ 1,045 అడుగుల నీటిమట్టం ఉండాలి. ప్రస్తుతం జీరో టీఎంసీల నీటిమట్టంతో 314.770 మీటర్లలో 1,032.710 అడుగుల్లో నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల లేకపోయినప్పటికీ ఆవిరి రూపంలో 131 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.






## ఉరేసుకొని రైతు ఆత్మహత్య



మల్లేశ్‌గౌడ్ (ఫైల్)

వెల్దండ, మే19 : ఉరేసుకొని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దండ మండలం కంటోన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కంటోన్‌పల్లికి చెందిన కేశమని రైతు మల్లేశ్‌గౌడ్ (38) వ్యవసాయమే ఆధారంగా జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న మల్లేశ్‌గౌడ్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, మానసికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవి వెల్లడించారు.

## వంగూరులో భారీ వర్షం

- పిడుగుపాటుతో ఆవు, మేకలు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు, మేకలు

వంగూరు, మే 19 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉపరితల ద్రోణి కారణంగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు తీవ్రమైన ఎండల నుంచి ఉపశమనం పొందారు. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వంగూరు మండల కేంద్రంతోపాటు డిండిచింతపల్లి, ఉమ్మాపూర్, చౌదర్‌పల్లి, పోల్కంపల్లి, గాజర, నిజాంబాద్, మిట్టసదగోడు, ఉల్పర, రంగాపూర్, కొండారెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి తోడు పలు చోట్ల పిడుగులు పడ్డాయి. మండలంలోని నిజాంబాద్‌లో ఆదివారం పిడుగుపడి లింగమయ్యకు చెందిన ఆవు, పాపయ్యకు చెందిన మూడు మేకలు మృతి చెందాయి.

## శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, మే 19 : శ్రీశైలంలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం, వారాంతపు సెలవులు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి యాత్రికులు స్వామి, అమ్మవారి దర్శనాలకు పోటెత్తారు. దీంతో ఆదివారం సాయంత్రం పురవీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులకు ఆర్జిత సేవలో పాల్గొనే అవకాశం కల్పించారు. భ్రమరాంబామల్లికార్జున స్వామి, అమ్మవార్ల ఉభయ ఆలయాలతోపాటు పరివార దేవతాలయాల దర్శనాలకు సుమారు నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. పర్యాటక ప్రదేశాలను చూసేందుకు యాత్రికులు ఆసక్తి చూపుతున్నారు.



క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న యాత్రికులు